## ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్ 2025

దేశంలోని 18 పెద్ద రాష్ట్రాల్లో 2022-23 ఆర్థిక స్థితిగతులను విశ్లేషిస్తూ రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచిక (ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్-FHI) 2025ను 16వ ఆర్థిక సంఘం అధ్యక్షుడు అరవింద్ పనగారియా, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు సుమన్ బేరి, సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం విడుదల చేశారు. కాగ్, ఆర్బీఐతో పాటు వివిధ సంస్థల ద్వారా సేకరించిన సమాచారం ద్వారా నీతి ఆయోగ్ ఈ నివేదికను రూపొందించింది. వికసిత్ భారత్ @2047 లక్ష్యాన్ని సాధించేందుకు ఈ నివేదిక కీలకం. నాణ్యత, ఆదాయ సమీకరణ, ఆర్థిక హేతుబద్ధత, రుణసూచిక, రుణ స్థిరత్వం అనే ఐదు కీలకాంశాల ఆధారంగా ఆర్థిక ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసింది. దీనిలో ఒడిశా 67.8 శాతం, ఛత్తీస్‌గఢ్ 55.2 శాతం, గోవా (53.6 శాతం స్కోర్‌తో వరుసగా తొలి మూడుస్థానాల్లో నిలిచాయి. తెలంగాణ (43.6) 8, ఆంధ్రప్రదేశ్ (20.9) 17వ స్థానాల్లో ఉన్నాయి. పంజాబ్ (10.7) 18వ స్థానంలో నిలిచింది.

## ఆగాఖాన్

షియా ఇస్మాయిలీ ముస్లింల 49వ వారసత్వ ఇమామ్, నాలుగో ఆగాఖాన్ 'ప్రిన్స్ కరీం అల్ హుస్సేనీ పోర్చుగల్‌లో ఫిబ్రవరి 4న మరణించారు. ఆయన స్థాపించిన ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెటవర్క్ 30కి పైగా దేశాల్లో ఆరోగ్య రక్షణ, గృహనిర్మాణం, విద్య, గ్రామీణ ఆర్థికాభివృద్ధి తదితర రంగాల్లో సేవా కార్యకలాపాలు నిర్వహిస్తుంది. లాభాపేక్ష లేని అభివృద్ధి కార్యకలాపాల కోసం ఏటా దాదాపు రూ. 8,500 కోట్లు ఖర్చు చేస్తున్నది. ఐదో ఆగాఖాన్‌గా, 50వ ఇమామ్‌గా తన కుమారుడు రహీం అల్ హుస్సేనీని నియమిస్తూ ఆయన తన వీలునామాలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వం 2015లో పద్మవిభూషణ్ అవార్డుతో ఆయన్ను సత్కరించింది.



# పట్టు సాధిస్తే.. పదిలమే

**పదో తరగతి పేపర్ విధానంపై అవగాహన**



### లీకేజీకి చెక్

- ప్రశ్నపత్రం లీకేజీని అరికట్టడానికి విద్యాశాఖ పటిష్ఠమైన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ప్రశ్నపత్రంపై క్యూఆర్ కోడ్, సీరియల్ నంబర్ ముద్రించడానికి నిర్ణయించినట్లు తెలుస్తుంది. దీనివల్ల ఏ సెంటర్ నుంచి ఏ విద్యార్థి ప్రశ్నపత్రం పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిందో సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. కానీ దీనిపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

### గ్రేడింగ్ విధానానికి స్వస్తి

- ఈ విద్యా సంవత్సరం నుంచి గ్రేడింగ్ విధానానికి విద్యాశాఖ స్వస్తి పలకనుంది. మార్కులు మాత్రమే వేస్తారు. అంతర్గత, ప్రధాన పరీక్షల మార్కులను కలిపి 100 మార్కులకు వచ్చిన మార్కులే వేస్తారు. ఈ ఏడాది మాత్రమే అంతర్గత మార్కుల విధానం అమల్లో ఉంటుంది. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి అంతర్గత మార్కులుండవు. మొత్తం 100 మార్కులకు పరీక్షలను నిర్వహిస్తారు.

### 'పెన్' నంబర్

- పదో తరగతి మార్కుల మెమోలపై విద్యార్థుల 'పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్)'ను కూడా ముద్రించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఆధార్ నంబర్ లాంటిదే ఈ పెన్ నంబర్.

### తగ్గిన చాయిస్

- గతేడాది నుంచి ఏడు పేపర్లతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. సైన్స్ మినహా మిగతా అన్ని సబ్జెక్టుల్లో ఒకే ప్రశ్నపత్రం, ఒకే బిట్ పేపర్ ఉంటుంది. భౌతిక, జీవ శాస్త్రాలకు వేర్వేరు రోజుల్లో పరీక్షలు ఉంటాయి. ప్రశ్నపత్రంలో లఘు, అతి లఘు సమాధాన ప్రశ్నల్లో చాయిస్ ఉండదు. వ్యాసరూప ప్రశ్నల సంఖ్య పెరిగింది. వ్యాసరూప ప్రశ్నల్లో మాత్రమే చాయిస్ ఉంటుంది. కాబట్టి 'సి' గ్రేడ్ విద్యార్థులు అప్రమత్తతతో సన్నద్ధం కావాలి. నూతన పరీక్ష విధానంలో విషయ అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణకే ప్రాధాన్యం ఇచ్చారు. పాఠ్య విషయాన్ని తగ్గించి ముఖ్యాంశాలను విశదీకరిస్తూ వాటిపై జ్ఞానం, అవగాహన, వినియోగం, నైపుణ్యం, నిత్యజీవిత అన్వయానికి సంబంధించిన ప్రశ్నలు ఇచ్చారు. అందువల్ల పని అనుభవం, స్వీయ రచన, బృంద చర్చల ద్వారా నేర్చుకోవడం అనే విధానాన్ని అనుసరించాలి.

### విద్యాప్రమాణాలను గుర్తించాలి

- ప్రశ్నపత్రాన్ని విద్యాప్రమాణాలకు అనుగుణంగా రూపకల్పన చేస్తున్నారు. దీనివల్ల ఏవో కొన్ని అధ్యాయాలను చదివితే సరిపోదు. అన్ని అధ్యాయాలను చదవాలి. ప్రశ్నలు ఏ అధ్యాయంనుంచైనా అడగవచ్చు. కాబట్టి విద్యాప్రమాణాలకు అనుగుణంగా ప్రశ్నలను గుర్తించి సన్నద్ధం కావాలి. ప్రశ్నలకు సూటిగా సమాధానాలుండవు. బట్టీ పట్టి రాయడానికి ఆస్కారం ఉండదు. కాబట్టి పాఠ్యపుస్తకంలోని అంశాలు, భావనలను అవగాహన చేసుకుని నిజ జీవితానికి అన్వయిస్తూ సమాధానాలు రాయాలి. బహుళ సమాధానాలు వచ్చేలా ప్రశ్నల స్వభావం ఉంటుంది. ఒకసారి పబ్లిక్ పరీక్షలో వచ్చిన ప్రశ్నలు తిరిగి పునరావృతం కావు. పాఠ్యపుస్తకంలో ఇచ్చిన ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్టుగా రావు. అవే స్వభావంగల ఇతర ప్రశ్నలను రూపొందించి ఇస్తారు. ప్రశ్నలు విద్యార్థుల సృజనాత్మకత, విలువలు, సౌందర్యాత్మక స్పృహ, సహజవనరుల సంరక్షణ, మానవతా విలువలు, జాతీయ సమైక్యత వంటి మొదలైన అంశాలను అంచనా వేసే విధంగా రూపొందిస్తారు. కాబట్టి సొంతంగా ఆలోచించి సమాధానాలు రాసేలా ప్రిపరేషన్ కొనసాగాలి.

### మూల్యాంకన విశ్లేషణ

- ప్రస్తుత విధానంలో హిందీతో పాటు మిగతా భాష, భాషేతర సబ్జెక్టులకు ఒకటే పేపర్. ఒక్కో పేపర్ 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 80 మార్కులకు పబ్లిక్ పరీక్ష, 20 మార్కులు పాఠశాలలో ఫార్మాటివ్ (అంతర్గత) మూల్యాంకనం ద్వారా ఉపాధ్యాయులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు. ఈ విధానం ఈ ఒక్క విద్యాసంవత్సరం మాత్రమే అమల్లో ఉంటుంది. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి అంతర్గత మార్కులుండవు. మొత్తం 100 మార్కులకు పరీక్షలు నిర్వహిస్తారు.


మహమ్మద్ సలీం షరీఫ్
మండల విద్యాధికారి
కోదాడ, సూర్యాపేట జిల్లా
9948506786




## తె

మార్కులు 80
పార్ట్-ఎ - 60 మార్కులు

1. అవగాహన-పతిస్పందన (పఠన అవగాహన)- 20 మార్కులు

అ) పరిచిత గద్యంలో ఉపవాచకానికి సంబంధించి 8-10 వాక్యాలు రెండు పేరాల్లో ఇస్తారు. వీటికి సంబంధించి 5 ప్రశ్నలు ఇస్తారు. **5X1 = 5 మార్కులు**

ఆ) పరిచిత పద్యంలో పాఠ్య పుస్తకంలోని చుక్క గుర్తు ఉన్న పద్యాలు అంతర్గత చాయిస్‌తో ఇస్తారు. వీటికి సంబంధించి పద్యాన్ని పూరించి భావం రాయమని గాని లేదా పద్యాన్ని ఇచ్చి ప్రతిపదార్థం రాయమని అడుగుతారు. **5X1 = 5 మార్కులు**

ఆ) అపరిచిత గద్యం/పద్యంలో ఏదో ఒకటి ఇస్తారు. గద్యం అయితే వైజ్ఞానిక, సామాజిక, పర్యావరణం వంటి అంశాలపై 8-10 వాక్యాలు రెండు పేరాల్లో ఇస్తారు. పద్యం అయితే సరళమైనది, సులభమైనది, బాగా ప్రాచుర్యం ఉన్న శతకాల నుంచి ఇవ్వవచ్చు. వీటికి సంబంధించి 5 ప్రశ్నలు ఇస్తారు.

- ప్రతి ప్రశ్నకు 2 మార్కులు. **5X2 =10 మార్కులు**

2. సృజనాత్మక-వ్యక్తీకరణ- 40 మార్కులు

అ) 5 లేక 6 వాక్యాల్లో లఘు సమాధానాలు రాసేవి 4 ప్రశ్నలు చాయిస్ లేకుండా ఇస్తారు. **4X3 = 12**

ఆ) పద్యభాగం నుంచి ఒకటి, గద్యభాగం నుంచి ఒకటి, ఉపవాచకం నుంచి ఒకటి, సృజనాత్మకతకు సంబంధించి ఒకటి అంతర్గత చాయిస్‌తో 4 వ్యాస రూప ప్రశ్నలు ఇస్తారు. **4X7 = 28**

పార్ట్-బి - **20 X 1 = 20**

- భాషాంశాలకు చెందిన ప్రశ్నలు ఇస్తారు. ఇందులో 10 పదజాలానికి, 10 వ్యాకరణాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. ఇందులో మొదట రెండు పదాలకు సొంత వాక్యాలు అడుగుతారు. 8 ప్రశ్నలు పర్యాయ పదాలు, నానార్థాలు, అర్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, ప్రకృతి వికృతులు వంటివి అడుగుతారు. 10 వ్యాకరణాంశ ప్రశ్నల్లో సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, వాక్యాల (సంశ్లిష్ట, సంయుక్త, కర్తరి, కర్మణి, ప్రత్యక్ష/పరోక్ష కథన, ఆధునిక వాక్యాలు) నుంచి ప్రశ్నలు వస్తాయి. అన్నీ బహుళైచ్ఛిక ప్రశ్నలు. **మొత్తం 20X1 = 20.**
- తెలుగు తొలి పరీక్ష కావడం వల్ల భయాందోళన, ప్రాథమిక అంశాలు, వ్యాకరణం, పద్య రచనల్లో అభిరుచి లేకపోవడం తేలికైన తెలుగులో తక్కువ మార్కులు రావడానికి కారణాలు. మాతృభాషే కదా చాలా సులభమనే భావనతో అతి ఆత్మవిశ్వాసంతో ఉంటారు. చివరికి ఫెయిలై బాధపడుతుంటారు. మాతృభాషపై మమకారం పెంచుకుని మెళకువలను పాటిస్తూ కొద్దిగా శ్రమిస్తే పది పాయింట్లు దక్కించుకోవచ్చు.
- సంధుల్లో సవర్ణ దీర్ఘ, గుణ, త్రిక సంధుల ఉదాహరణలను బాగా చదవాలి.
- వ్యాస రచన ప్రశ్నల్లో పండుగలు, సమకాలీన అంశాలు, ఎయిడ్స్ వ్యాధి, ప్రపంచీకరణ, ప్రకృతి విపత్తులు వంటి అంశాలపై బాగా అవగాహన పెంచుకోవాలి.
- ప్రకృతి వికృతులు, పద్య లక్షణాలు, పర్యాయ పదాలు, వ్యుత్పత్త్యర్థాలు, అంకారాలు, నానార్థాలు, ఛందస్సు, పరోక్ష వాక్యాలు, సంయుక్త వాక్యాలు, విగ్రహ వాక్యాలు, సమాసానికి ఉదాహరణలపై అవగాహన పెంచుకుంటే మార్కులు సులభంగా పొందవచ్చు.
- ప్రతి పాఠం కవి-కవి పరిచయం, శతక పద్యాలు-భావాలు, పాఠ్య పుస్తకం వెనుక ఉన్న ఉదాహరణలు, వ్యాకరణాంశాలు ప్రాక్టీస్ చేయాలి.
- అర్థ సందర్భాలు సందర్భానికి తగినట్లుగా రాయాలి.
- జాతీయానికి, సొంతవాక్యాలకు ఉన్న తేడాను గమనించి సమాధానాలు రాయాలి.
- తెలిసిన, తెలియని గద్య, పద్య అంశాలను చదివి అవగాహన చేసుకుని సమాధానాలు రాస్తే తేలికగా 20 మార్కులు పొందవచ్చు.
- గైడ్ కంటే పాఠ్యపుస్తకానికే ప్రాధాన్యం ఇవ్వాలి.
- అక్షర దోషాలు, వొత్తులు, పొల్లులు తప్పులేకుండా జాగ్రత్త వహించాలి.
- కొన్నిసార్లు కవుల పేర్లు తప్పుగా రాస్తుంటారు. ఈ అంశాన్ని గుర్తించాలి.
- చేతి రాత అందంగా ఉంటే మరిన్ని మార్కులు వస్తాయి.

## హి

### 'హిందీ'పై అయోమయం వద్దు

మార్కులు- 80
పార్ట్-ఎ - 60 మార్కులు
1. అవగాహన, ప్రతిస్పందన (పఠన అవగాహన)- 20 మార్కులు (5+10+5)
2. వ్యక్తీకరణ - సృజనాత్మక- 40 మార్కులు (16+24)

**పార్ట్-బి - 20X1 =20**
పదజాలాంశాలు- 10 మార్కులు
వ్యాకరణాంశాలు- 10 మార్కులు

- హిందీలో అధిక మార్కులు సాధించడంలో చాలా మంది విఫలమవుతున్నారు. హిందీలో 10కి 10 సాధించిన వారి సంఖ్య చాలా తక్కువ ఉంది. భయాన్ని వీడి అర్థం చేసుకుని, ఆకళింపు చేసుకుంటే హిందీలో కూడా 10కి 10 మార్కులు సాధించవచ్చు. హిందీపై అవగాహన లోపించడం, చిన్న చిన్న పదాలకు అర్థాలు తెలుసుకోలేకపోవడం, తప్పులతో కూడిన చేతిరాత విద్యార్థుల వైఫల్యానికి ప్రధాన కారణం. ఆరో తరగతి నుంచే భాషపై బలమైన పునాదులు పడేలా శ్రద్ధ తీసుకోవాలి.
- రాసేటప్పుడు అక్షర దోషాలు లేకుండా జాగ్రత్త పడాలి. లేకపోతే ఆ పదానికి అర్థమే మారిపోతుంది.
- వ్యాసరూప ప్రశ్నలు, స్వీయ రచనలపై పట్టు సాధించాలి.
- పాఠ్య పుస్తకం చివర ఉన్న బిట్స్ చదివితే 20 మార్కులు పొందవచ్చు.
- చుక్క గుర్తు పద్యాలు కంఠస్థం చేయడమే కాకుండా వాటి భావాలను చదివి రాయడం చేయాలి.
- మిత్రునికి లేఖ, చుట్టీ పత్ర్ ఎక్కువగా అడుగుతుంటారు. వీటిని బాగా చదవాలి.
- ప్రశ్నపత్రం పార్ట్- ఏ లో గద్య, పద్య భాగాలను చదివి అవగాహన చేసుకుని సమాధానాలు రాస్తే 20 మార్కులు సాధించవచ్చు.
- సంధి విచ్ఛేదనం, విశేషణం, ముహావరా (జాతీయాలు), లింగ్ బదల్‌నా, వచన్ బదల్‌నా వంటి శబ్ద, వాక్య సంబంధ వ్యాకరణాంశాలపై ప్రాథమిక పరిజ్ఞానం తప్పనిసరిగా కలిగి ఉండాలి.
- చేతి రాత కుడా ఆకర్షణీయంగా ఉంటే మార్కులు కోల్పోయే అవకాశం తక్కువ.

## ఆ

### ఆంగ్లంపై ఆందోళన వద్దు

80 మార్కులు
పార్ట్-ఎ - 60 మార్కులు
ఎ) రీడింగ్ కాంప్రహెన్షన్ - స్టడీ స్కిల్స్- 32 మార్కులు
బి) వొకాబులరీ, గ్రామర్- 8 మార్కులు
సి) క్రియేటివ్ రైటింగ్- 20 మార్కులు
పార్ట్-బి - 20 X 1 =20
**ప్యాసేజ్/పోయెం- 5 మార్కులు**

- వొకాబులరీ, గ్రామర్- 15 మార్కులు
- ఆంగ్లంలో ప్రతి అంశంపై ప్రాథమిక అవగాహన ఉంటే అత్యధిక మార్కులు సాధించవచ్చు.
- ఇంగ్లిష్ రీడర్‌లోని పాఠాలు, పోయెమ్స్‌కు సంబంధించిన ముఖ్యాంశాలను అవగాహన చేసుకుని ముఖ్యమైన పాయింట్లు గుర్తుంచుకుంటే ఏ ప్రశ్నకైనా సులభంగా సమాధానం రాయవచ్చు.
- ప్రశ్నపత్రంలో గద్య, పద్య భాగాలను చదివి, అన్‌సీన్ ప్యాసేజ్, అన్‌సీన్ పోయెమ్‌లను అవగాహన చేసుకుని అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాస్తే ఈజీగా 32 మార్కులు సాధించవచ్చు.
- వాక్య దోషాలను సరిచేయడం, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్‌పై ఇచ్చిన వ్యాసంలో ఉన్న ఖాళీలను పూరించడం ప్రాక్టీస్ చేయాలి.
- గద్యభాగాన్ని చదివి స్వయంగా సంభాషణ రూపంలోగాని, ప్రొఫైల్ రూపంలోగాని, సందేశ రూపంలోగాని రాసేటట్టు సిద్ధమవాలి.
- టెక్ట్స్‌బుక్‌లో ప్రతి యూనిట్ వెనుక ఉన్న గ్రామర్ ప్రాక్టీస్ చేయాలి.
- బిజినెస్, పర్సనల్ లెటర్స్ రాయడం నేర్చుకోవాలి. సందర్భోచిత లేఖలు, బయోగ్రాఫికల్ స్కెచ్, కన్వర్జేషన్, బయోడేటా తయారీ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

## సా

### సాంఘిక శాస్త్రం

**పార్ట్-ఎ - 30 మార్కులు**

- అతి లఘు సమాధాన ప్రశ్నలు 6, 2 మార్కులు. మొత్తం 12 మార్కులు. చాయిస్ లేదు.
- లఘు సమాధాన ప్రశ్నలు 6, 3 మార్కులు. మొత్తం 18 మార్కులు. చాయిస్ లేదు.
- వ్యాసరూప ప్రశ్నలు 6, 5 మార్కులు. మొత్తం 30 మార్కులు. అంతర్గత చాయిస్ ఉంది.

**పార్ట్-బి - 20 మార్కులు**

- బహుళైచ్ఛిక ప్రశ్నలు 20, 1 మార్కు. మొత్తం 20 మార్కులు. చాయిస్ లేదు

**విద్యాప్రమాణాలు**

- విషయ అవగాహన- 45%, 36 మార్కులు
- వ్యాఖ్యానించడం- 12.5%, 10 మార్కులు
- సమాచార నైపుణ్యం- 12.5%, 10 మార్కులు
- సమకాలీన అంశాలపై ప్రతిస్పందన- 11.25%, 9 మార్కులు
- పట నైపుణ్యాలు- 12.5%, 10 మార్కులు
- ప్రశంస, సున్నితత్వం- 6.25%, 5 మార్కులు
- వనరుల అభివృద్ధి, సమానత (భూగోళం, అర్థశాస్త్రం), సమకాలీన ప్రపంచం, భారతదేశం (చరిత్ర, పౌర శాస్త్రం) అనే పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- ఇండియా, వరల్డ్ మ్యాప్‌లో ప్రధాన ప్రాంతాలు, అంశాల ఉనికిని ఇంటి వద్ద బాగా ప్రాక్టీస్ చేయాలి. భారతదేశ, ప్రపంచ పటాల్లో అంతర్గత చాయిస్ ఇస్తారు.
- పాఠ్యాంశాల చివరన ఉన్న కీలక పదాలు, నిర్వచనాలు, పట్టికలు, గ్రాఫ్‌లను బాగా విశ్లేషణ చేసుకుంటూ చదవాలి.

### నిర్మాణాత్మక (అంతర్గత) మూల్యాంకనం

**పాఠశాలలో నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకన పరీక్షలు నిర్వహిస్తారు. నిర్మాణాత్మక మూల్యాంకనం నుంచి తీసుకునే 20 మార్కుల్లో కనీసం 7 మార్కులు సాధించాలి. ఒక నిర్మాణాత్మక మదింపునకు 50 మార్కులుంటాయి. - ఇందులో వ్యక్తిగత ప్రతిస్పందనలకు 10, పాఠ్య పుస్తక ప్రశ్నలకు (రాతపని) 10, ప్రాజెక్ట్ వర్క్‌కు 10, స్లిప్ టెస్ట్‌కు 20 మార్కులుంటాయి. నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకన మొత్తాన్ని '5'కు కుదించి ఫలితం ఇస్తారు. 10 మార్కుల మొత్తాన్ని 8తో, 20 మార్కుల మొత్తాన్ని 16తో భాగించి '5'కు కుదించి మొత్తం 20 మార్కుల ఫలితాన్ని అంతర్గత మదింపుగా బోర్డుకు అందజేస్తారు. ఇందులో కనీస మార్కుల నిబంధన లేదు. జీవ, భౌతిక శాస్త్రాలకు కలిపి 20 మార్కులకు నిర్మాణాత్మక మూల్యాంకనం చేస్తారు. ఈ 20 మార్కుల్లో జీవ, భౌతిక శాస్త్రాలకు 10 మార్కుల చొప్పన కేటాయించారు. 10 మార్కులకు 3 1/2 మార్కులు పొందాలి. మొత్తం 7 మార్కులు సాధించాలి. మిగతా విషయాల్లో 20 మార్కులకు 7 మార్కులు పొందాలి.**

**పదో తరగతి పరీక్ష విధానంలో ఈ విద్యాసంవత్సరం పలు మార్పులకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు ప్రధాన సమాధాన పత్రం 4, అదనపు సమాధాన పత్రం 4 పేజీలు ఇస్తున్నారు. ఇవేకాకుండా ఇంకా అదనపు సమాధాన పత్రాలు తీసుకుంటే వాటిని ప్రధాన సమాధాన పత్రంలో రాసేవారు.**

**ఈ ఇబ్బందిని తొలగించేందుకు సీరియల్ నంబరుతో 24 పేజీల ఒకే బుక్‌లెట్‌ను ఇస్తారు. అందులోనే మొత్తం సమాధానాలు రాయాలి. అదనపు సమాధాన పత్రాలు ఇవ్వరు. ఈ బుక్‌లెట్‌కే బిట్ పేపర్, గ్రాఫ్, మ్యాప్ వంటివి జతచేసి ఇవ్వాలి.**

- MAR 21 శుక్రవారం **తెలుగు**
- MAR 22 శనివారం **హిందీ**
- MAR 24 సోమవారం **ఆంగ్లం**
- MAR 26 బుధవారం **గణితం**
- MAR 28 శుక్రవారం **సైన్స్ పార్ట్-1** భౌతిక, రసాయన శాస్త్రం (ఉ. 9.30 నుంచి 11 వరకు)
- MAR 29 శనివారం **సైన్స్ పార్ట్-2** జీవశాస్త్రం (ఉదయం 9.30 నుంచి 11 వరకు)
- APR 2 బుధవారం **సాంఘిక**
- APR 3 గురువారం **ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్- 1**
- APR 4 శుక్రవారం **ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్- 2**

## గ

### గణితంపై గందరగోళం వద్దు

పార్ట్ : ఎ - 30 మార్కులు

- అతి లఘు సమాధాన ప్రశ్నలు 6, ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు. చాయిస్ లేదు.
- లఘు సమాధాన ప్రశ్నలు 6, ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు. చాయిస్ లేదు
- వ్యాసరూప ప్రశ్నలు 6, ఒక్కో ప్రశ్నకు 5 మార్కులు. చాయిస్ ఉంది.

**పార్ట్-బి - 20 మార్కులు**

- బహుళైచ్ఛిక ప్రశ్నలు 20, ఒక్కో ప్రశ్నకు 1 మార్కు. చాయిస్ లేదు.

**విద్యాప్రమాణాలు**

- సమస్యా సాధన- 40%, 32 మార్కులు.
- కారణాలు చెప్పడం, నిరూపించడం- 20%, 16 మార్కులు
- వ్యక్త పరచడం- 10%, 8 మార్కులు
- అనుసంధానం- 15%, 12 మార్కులు
- దృశ్యీకరణ- ప్రాతినిధ్యపరచడం- 15%, 12 మార్కులు
- విద్యాప్రమాణాలను అవగతం చేసుకుని పట్టు సాధిస్తే గణితంలో 10 గ్రేడ్ పాయింట్లు సాధించవచ్చు.
- ఏ అధ్యాయం నుంచైనా ఎన్ని ప్రశ్నలైనా అడగవచ్చు. ప్రతి అధ్యాయం కీలకమే.
- ప్రతి అధ్యాయంలో సూత్రాలు, భావనలను వాటి ద్వారా సాధించే సమస్యలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- పాఠ్య పుస్తకంలో ఉన్న సమస్యలు పరీక్షలో నేరుగా అడగరు. వాటిని మార్చి అవే స్వభావం గల ప్రశ్నలు ఇస్తారు.
- వ్యాసరూప ప్రశ్నలకు ఎక్కువ వెయిటేజీ ఉంటుంది. కారణాలు వివరించడం, దృశ్యీకరణ-ప్రాతినిధ్యపరచడం, సమస్యా సాధన వంటి ప్రశ్నలు ఎక్కువగా వ్యాసరూప ప్రశ్నల్లో ఇస్తుంటారు.
- సమితులు, శ్రేఢులు, సిద్ధాంతాలు, నిరూపక జ్యామితి, సాంఖ్యక శాస్త్రం, సరూప త్రిభుజాలు, క్షేత్రమితి, త్రికోణమితి అనువర్తనాల నుంచి వ్యాసరూప ప్రశ్నలు ఇచ్చే అవకాశం ఉంది.
- పాఠ్య పుస్తకంలోని 'ఆలోచించి, చర్చించి రాయండి' 'ఇవి చేయండి' 'ప్రయత్నించండి' అని ఇచ్చిన సమస్యలను కచ్చితంగా ప్రాక్టీస్ చేయాలి.
- గణితంలో వాస్తవ సంఖ్యలు, సమితులు, శ్రేఢులు, నిరూపక జ్యామితి, సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత తేలికైనవి.


మిగితా 6వ పేజీలో..